క్లుప్తంగా

భీమవరం అగ్నిమాపక కేంద్రం ఏడీఎఫ్ఓగా శ్రీనివాసరావు


కె శ్రీనివాసరావు

భీమవరం: భీమవరం అగ్నిమాపక కేంద్రం ఏడీఎఫ్ఓగా కె శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీహెచ్ సూర్య ప్రకాశరావు విజయవాడ బదిలీకావడంతో నిడదవోలులో పనిచేస్తున్న శ్రీనివాసరావు భీమవరం ఏడీఎఫ్ఓగా నియమించారు. అలాగే ఇక్కడ వివిధ హోదాల్లో పనిచేస్తున్న 14 మంది సిబ్బంది బదిలీ అయ్యారు. వారిస్థానంలో లీడింగ్ ఫైర్‌మెన్స్‌గా ఎం శ్రీను, ఎన్ వెంకటేశ్వర్లు, ఎం లక్ష్మణస్వామి, డ్రైవర్, ఆపరేటర్స్‌గా ఎస్ శ్రీనివాస్, ఐఎన్‌వీఎస్ శ్యామ్‌కుమార్, టీబీ శేషగిరి, పి సూరిబాబు, ఫైర్ మెన్స్‌గా పి శ్రీనివాసరావు, డీపీ రాజు, ఎ వాసుకృష్ణ, పీవీ సత్యనారాయణ, వి వెంకటేష్, ఎస్‌కే అబ్దుల్‌జబ్బర్, ఎ రియాజ్ నియమితులయ్యారు.

లయన్స్ ఆదర్శ నూతన కమిటీ ఏర్పాటు


నూతనంగా ఏర్పడిన లయన్స్ కమిటీ.


ఆకివీడు: లయన్స్ క్లబ్‌లు సేవా కార్యక్రమాల్లో అభినందనీయమని లయన్స్ జిల్లా రెండవ గవర్నర్ ఆర్వీ.సూర్యనారాయణ రాజు చెప్పారు. స్థానిక లయన్స్ కార్యాలయంలో ఆదర్శ లయన్స్ నూతన కమిటీ ఏర్పాటు విషయాల్ని శుక్రవారం విలేకర్లకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సేవా రంగానికి భారీ వేదిక లయన్స్‌క్లబ్ అన్నారు. క్లబ్ అధ్యక్ష పదవి వరించడం అదృష్టమన్నారు. ఆదర్శ లయన్స్ నూతన కమిటీ అధ్యక్షుడిగా కెవీఎస్.పూర్ణ చంద్ర శేఖర్, కార్యదర్శిగా ఎస్వీజీ. అనిల్ కుమార్, కోశాధికారిగా పీ.వంశీకృష్ణతో పాటు కార్యవర్గం ఈ నెల 15వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనుందని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు మోరా జ్యోతిరెడ్డి, మోటుపల్లి శ్రీనివాసరావు,చెంచయ్య, అహ్మద్, వెంకన్నబాబు, మన్నే సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


భీమవరం ఎల్‌హెచ్ టౌన్‌హాల్లో యోగాసనాల దృశ్యం

భీమవరం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని పలువురు వక్తలు కొనియాడారు. భీమవరం ఎల్‌ఎచ్ టౌన్ హాల్‌లో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కృష్ణ దేవరాయ పతంజలి యోగ మిత్రమండలి, త్యాగరాజ భవనం యోగా సమితి, ఏఎస్ఆర్ యోగసమితి, యూత్ హాస్టల్ సభ్యులు యోగాసనాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాయణం రమేష్ ఆధ్వర్యంలో సీహెచ్ వాసు, కె లావణ్య ప్రోటోకాల్ యోగా ఆసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో టౌన్ హాల్ ప్రెసిడెంట్ కోళ్ల రామచంద్రరావు(అబ్బులు), ప్రధాన కార్యదర్శి గ్రంధి సురేష్, కార్యదర్శి బేతు కృష్ణారావు, మేళం శ్రీధరప్రభాకర్, గ్రంధి వెంకటరావు (నానాజీ) వబిలిశెట్టి వెంకటేశ్వరులు, కంతేటి వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం


భీమవరంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం దృశ్యం

భీమవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ డి రామ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయంలో ఎస్‌బీఐ, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్‌బీఐ సామాజికసేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రక్తదానం శిబిరంలో అనేకమంది పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ మెహర్‌బాబా, వబిలిశెట్టి కనకరాజు, మంతెన శివరామ భద్రిరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలి

యలమంచిలి: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాబితా సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ జాబితాలోని రైతులంతా రైతు సేవా కేంద్రానికి వెళ్లి వేలిముద్ర వేసి ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె కోరారు.

అడుగుకో గొయ్యి.. గజానికో గుంత

- ఛిద్రమైన రోడ్లు
- రాకపోకలకు అవస్థలు


భీమవరం రైతు బజారు వద్ద గోతులుపడ్డ రోడ్డుపై నీరు నిలిచిన దృశ్యం

భీమవరం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రోడ్లుకు మరమ్మతులు చేసినట్లు గొప్పగా ప్రచారం చేసుకుంటున్నా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు నేటికీ అధ్వానంగానే ఉన్నాయి. ప్రధానంగా ప్రధాన రహదారులు వెంబడీ ఇరువైపులా అక్రమణలతో ఎత్తుగా చేయడంతో చిన్నపాటి వర్షాలకే రోడ్లుపై నీరు నిచిలిపోయి ప్రయాణీకులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు వెంబడీ డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడం షాపులు, నివాస గృహాల వద్ద ఎత్తుగా చేయడంతో వర్షం నీటితోపాటు డ్రెయినేజీ నీరు రోడ్లపై నిలిచిపోయి రోడ్లు ధ్వంసమవుతున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉన్నా ఆర్‌అండ్‌బీ, మునిసిపల్, పంచాయతీరాజ్‌శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్లపై గోతులు పడి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో బస్‌లు, లారీలు, కార్లు వంటి వాహనాలు వెళ్లేటపుడు పాదచారులు, మోటారు సైకిల్స్‌పై వెళ్లేవారిపై బురద పడి ఇబ్బందులకు గురవుతున్నట్లు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



భీమవరంలో ఎఫ్‌సీఐ గొడన్స్ వద్ద జాతీయ రహదారిపై వర్షం నీరు దృశ్యం


శృంగవృక్షం రైల్వేగేటు దగ్గరలో రోడ్డుపై నీరు నిలిచిన దృశ్యం

ఇటు కన్నెత్తి చూడండి సారూ...

ఆకివీడు: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రత్యేక పారిశుధ్య పనులు, మొక్కలు నాటడం వంటివి చేపట్టాల్సి ఉండగా, స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోని కార్యాలయాలపై మొక్కలు యథేచ్ఛగా పెరుగుతోన్నాయి. స్వచ్ఛ కార్యాలయంలో వీటిని తొలగించకపోతే రానున్న రోజుల్లో వృక్షాలుగా ఎదిగి భవనాల్ని కూల్చివేస్తాయన్న విషయాన్ని అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోకపోవడం దారుణమని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటువంటి చిన్న చిన్న మొక్కలు వృక్షాలుగా ఎదిగి ప్రాంగణంలోని పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ కార్యాలయం, గెస్ట్ హౌస్ మొత్తం పాడైపోయింది. నిర్మించిన 10 ఏళ్ల నిండకుండానే భవనం నీరుగారి నిరుపయోగమవుతోంది. కార్యాలయ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు తొలగించినా, భవనాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో వాటి వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతోంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై పెరుగుతోన్న పిచ్చి మొక్కల్ని తొలగించి, వర్షపు నీరు శ్లాబ్‌ల మీద నిలబడకుండా వ్యర్థాల్ని తొలగించాలని కోరుతున్నారు.





స్థానిక ఎంపీడీఓ ప్రాంగణంలోని కార్యాలయాలపై పెరుగుతోన్న మొక్కలు, వృక్షాలుగా తయారవుతోన్న దృశ్యం



మావుళ్లమ్మ అమ్మవారికి బంగారం సమర్పణ


అమ్మవారికి బంగారం సమర్పిస్తున్న డీఎస్పీ జయసూర్య దంపతుల కుమార్తె కృష్ణశ్రీ నందిని

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్లమ్మ అమ్మవారికి శుక్రవారం భీమవరం డీఎస్పీ రావూరి గణేష్ జయసూర్య, జయశ్రీ దంపతుల కుమార్తె రావూరి కృష్ణ శ్రీ నందిని 8 గ్రాములు బంగారాన్ని సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ వారిచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ శేష వస్త్రం, ప్రసాదాలు అందచేశారు.ఈసందర్భంగా డీఎస్పీ జయసూర్య దంపతులు మాట్లాడుతూ అమ్మవారి మొక్కు తీర్చుకొవడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదాతలు కావాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు జిల్లా కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో రెడ్‌క్రాస్ సొసైటీ పశ్చిమగోదావరి జిల్లా యూనిట్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, రక్తం దానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో మరొకరికి ప్రాణం పోసినట్లేనని తద్వారా ఒక కుటుంబం ఆనందంగా జీవించగలుగుతారన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ప్రమాదం జరిగిన మొదటి గంటలో రక్తం అందజేస్తే విలువైన ప్రాణాలు కాపాడుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎం.ఎస్.వి శివరామ భద్రరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి, డిప్యూటీ డిఎంహెచ్ఓ బి.భాను నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, డీఈవో ఇ.నారాయణ, ఆర్డీవో ఉమామహేశ్వరరావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి.లక్ష్మి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, మున్సిపల్ కమిషనర్లు కె.రామచంద్రారెడ్డి, ఏసుబాబు, వబిలిశెట్టి శెట్టి కనకరాజు, పదుల సంఖ్యలో రక్తదానం చేసిన దాతలు, రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు, చర్చ్ ఆఫ్ గాడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్‌కు ప్రతిష్టాత్మకమైన లోకల్ చాప్టర్ అస్పిరెంట్ అవార్డు


భీమవరం డీఎన్నార్ కళాశాలకు అవార్డు వచ్చిన విషయాన్ని వివరిస్తున్న అధ్యక్షుడు నర్సింహరాజు

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల ప్రతిష్టాత్మకమైన లోకల్ చాప్టర్ ఆస్పిరెంట్ అవార్డుకు ఎంపికై ందని కళాశాల అధ్యక్షుడు గోకరాజు నర్సింహరాజు చెప్పారు. శుక్రవారం కళాశాలలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. కేంద్ర మానవ వనరులశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌పీటిఈఎల్‌లో కొత్త కోర్సులు చేయడంలో తమ ఇంజనీరింగ్ కళాశాల మందంజలో ఉండడంతో అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. జూలై 5వ తేదిన మద్రాస్ ఐఐటీలో అవార్డు అందుకోనున్నట్లు చెప్పారు. అలాగే ఈసీఈ విభాగానికి చెందిన అధ్యాపకుడు కె శేఖరబాబుకు మోటివేటెడ్ లెర్నర్‌బిలివర్, టాప్ పెర్ఫార్మింగ్ మెంటార్ స్టార్ అవార్డులు, ఈసీఈ విభాగాధిపతి కె వేణుగోపాల్‌కు బిలివర్ స్టార్ అవార్డు దక్కినట్లు నర్సింహరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యవారాయణరాజు (బాబు), ప్రిన్సిపల్ ఎం అంజన్‌కుమర్, వైస్ ప్రిన్సిపల్ బీవీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

చినిమిల్లికి అభినందనలు


చినమిల్లి వెంకటరాయుడిని అభినందిస్తున్న దృశ్యం

వీరవాసరం: భీమవరం వైఎస్సార్ సీపీ ఇన్చార్జ్ చినిమిల్లి వెంకట్రాయుడును శుక్రవారం వీరవాసరం మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవాకుల సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మంచి మనిషి, నిగర్వి ,స్నేహశీలి అయినటువంటి చినిమిల్లి వెంకట్రాయుడను భీమవరం వైఎస్సార్ సీపీ పార్టీ ఇన్చార్జిగా నియమించడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ ఎంతో మేలు చేకూర్చాలని గుర్తు చేశారు. అభినందించిన వారిలో మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందరరాజు, మాజీ జెడ్పీటీసీ మానుకొండ ప్రదీప్ కుమార్, భీమవరం టౌన్ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కోడే యుగంధర్, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, చికిలే మంగతాయారు, వీరవల్లి శ్రీనివాసరావు, షేక్ సత్తార్ సాహెబ్, కాండ్రేకుల శ్రీనివాసరావు, వీరవల్లి ప్రవీణ్, డివిడి ప్రసాద్, పిల్లి నరసింహమూర్తి , గోడి షణ్ముఖరావు, బొంతు రమేష్, సైదు శ్రీనివాస్, కందుల కాశి, కడలి శ్రీరాములు, కోడే శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

దుర్వాసన భరించాల్సిందేనా?

భీమవరం(ప్రకాశం చౌక్): నిత్యం వేలాది మంది ప్రయాణించే మిరమీయా కోడు డ్రెయిన్‌లో రోజుల తరబడి శుభ్రం చేయక వదిలివేసిన చెత్త చెదారంతో దుర్వాసన వెదజల్లుతూ అధ్వానంగా ఉన్నాయి. డ్రెయిన్ పొడవునా ఎక్కడబడితే అక్కడ చెత్తచెదారం నిలిచిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. డ్రెయిన్ అధ్వానంగా ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై ప్రత్యేక అధికారి, జాయింట్ కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.


మెంటేవారి తోటలో మిరిమియా కోడు (డ్రెయిన్) చెత్తాచెదారం

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో!

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం నుంచి వేంద్ర వయా పైపుల చెరువు రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేసి రోడ్డు చదును చేసి గ్రావెల్ వేశారు. ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అయిన్పటికి ఇప్పటివరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయలేదు. నెలలు తరబడి రోడ్డుపై తారు వేయకుండా వదిలి వేయడంతో రాళ్లు లేచి పోయి ప్రమాదకరంగా ఉన్నాయి. అలాగే విపరితమైన దుమ్ము పైకి లేవడంతో ద్విచక్రవాహనదారుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


రాళ్లు లేచి అధ్వానంగా ఉన్న పైపుల చెరువు రోడ్డు

యథేచ్ఛగా మద్యం అమ్మకాలు


స్థానిక గాలిబ్ చెరువు ప్రాంతం వద్ద సేవించిన మద్యం బాటిళ్లు.

ఆకివీడు: మండలంలోని పలు ప్రాంతాల్లో మద్యం విచ్చలవిడిగా సేవిస్తున్నారు. చీకటి పడిందంటే చాలు ఆయా ఖాళీ ప్రదేశాలు, చెట్ల క్రింద, చెరువు గట్లు, రైల్వే స్టేషన్ రోడ్లు, పాఠశాలల ప్రాంగణాల్లోనూ, దుంపగడప రైల్వే గేటు సమీపంలోనూ, ఇలా ఇష్టానుసారం ఆయా ప్రాంతాల్ని కేంద్రంగా ఎంచుకుని మద్యం సేవిస్తున్నారు. మద్యం సేవించిన తర్వాత మద్యం బాటిళ్లు, కూల్‌డ్రింక్ బాటిళ్లు, వాటర్ బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు అన్నింటినీ అక్కడే పారవేసి వెళ్లిపోతున్నారు. మరి కొంతమంది అయితే వాటిని పగులగొట్టి మరీ వెళ్తున్నారు. పంట పొలాల సమీపంలో తాగిన మద్యం బాటిళ్లను పగులగొట్టి చేలల్లో పారవేస్తున్న సంఘటనలు పలు చోట్ల ఉన్నాయి. స్థానిక సచివాలయ పోలీసులుగాని, పోలీస్ సిబ్బంది గాని రాత్రి పూట పెట్రోలింగ్ చేయకపోవడం, బెల్ట్ షాపుల్ని అరికట్టకపోవడంతో మద్యం సేవించడం విచ్చలవిడి అయిపోయిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్, సచివాలయ పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు విచ్చలవిడిగా మద్యం సేవించడంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మార్కెట్‌లోకి ఆల్ట్రోజ్ కారు విడుదల


ఆల్ట్రోజ్ కారును మార్కెట్లోకి విడుదల చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం టాటా మోటార్స్ ఆథరైజ్డ్ డీలర్ ఉండి రోడ్ భీమవరం నందు గల జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ షోరూం నందు శుక్రవారం సరికొత్త అప్డేట్స్, ఫీచర్స్‌తో వచ్చిన టాటా ఆల్ట్రోజ్ హచ్ బ్యాక్ కారును ఆవిష్కరించారు. భీమవరం కెనరా బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.మాధవరావు, ప్రీమియం కస్టమర్‌లు దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, హరికుమారరాజు, హెచ్‌డీఎఫ్‌సీ మహేష్, జాస్పర్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ డి.ఉదయ భాస్కర్ సంయుక్తగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా జాస్పర్ జనరల్ మేనేజర్ ఉదయభాస్కర్ మాట్లాడుతూ ఈ వెహికల్ పెట్రోల్ ఇంజన్, డీసెల్ ఇంజన్‌తో లభిస్తుందన్నారు. మధ్య తరగతి కుటుంబాలుకు అందుబాటు ధరలో లభించునని పెట్రోల్ వెహికల్ ప్రారంభ ధర 6.89,000 నుంచి డీజల్ ప్రారంభ ధర 8.99,000 నుంచి లభిస్తుందన్నారు.

పది మందిపై కేసు నమోదు

ఉండి: ఉండి పరిసర ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న పది మందిని అదుపులోకి తీసుకుని వారిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎండీ నసీరుల్లా తెలిపారు.ఎవరైనా బహిరంగగంగా మద్యం సేవించినా, మద్యం సేవించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

మోసం కూటమి నైజం


కొరపాటి అనిత,రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

ఉండి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు కూటమి పార్టీల నాయకులు విద్యార్థులకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా మోసం చేస్తున్నారని రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొరపాటి అనిత అన్నారు. తల్లికి వందనం పథకంపై ఆమె స్పందిస్తూ శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా పలు విషయాలు తెలిపారు. ఏడాది పాలనలో సంబరాలు చేసుకుంటున్న కూటమి పార్టీ నాయకులు ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ డబ్బులు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఇంజనీరింగ్ వంటి ఉన్నత చదువులు చదువుకొనే, పేద, మధ్య తరగతి సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి కాలేజీలకు ఫీజులు చెల్లిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు సకాలంలో ఫీజు రియింబర్స్‌మెంట్ అమలు చేసి ఆదుకున్నారన్నారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను ఇంతగా మోసగించిన చరిత్ర ఎవ్వరికీ లేదని అది కేవలం కూటమి నాయకులకు మాత్రమే దక్కిందన్నారు. తల్లికి వందనం అని చెప్పి తల్లికి పంగ నామాలు పెట్టడం తగదని ఆమె విమర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: మండలంలోని లోసరిలో నూతనంగా నిర్మిస్తున్న 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రమునకు శనివారం కొత్తగా 33 కేవీ లైన్‌లు ఏర్పాటు, వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. తోకతిప్ప, బరువానిపేట, గరవళ్లదిబ్బ, లోసరి, దెయ్యాలదిబ్బ, నాగేంద్రపురం, గ్రామాలతో పాటు ఆక్వా చెరువుల లైన్లకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాలాత్రిపుర సుందరీదేవికి విశేష పూజలు

భీమవరం (ప్రకాశంచౌక్): జ్యేష్ఠమాస శుక్రవారం సందర్భంగా భీమవరం మెంటేవారితోటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారికి 108 మందర మొక్కలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమష్టి కృషితో దోమల వ్యాప్తిని అరికడదామని, దోమకాటు ఆరోగ్యానికి చేటు అని, కీటకజనిత ప్రదేశాలను తప్పక నిలువరించాలని, ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలని స్థానిక సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలో కడకట్ల, యాగర్లపల్లి, బేబీ సెంటర్ జంక్షన్‌లలో అర్బన్ హెల్త్ సెంటర్లు పరిధిలో శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు, వెక్టార్ కంట్రోల్ హైజీన్, క్షేత్రస్థాయి పరిశీలనలు, ర్యాలీ, మలేరియా మాసోత్సవాలపై ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు జరిగాయి. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలని, పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చునని చెప్పారు.